నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 21: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రీపురం ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కింగ్స్‌కాలనీ ఫేస్-1,2,3,4, నూర్‌కాలనీ, రిజ్వాన్ కాలనీ, రుమాన్సీ హోటల్, ఎక్సైజ్ స్కూల్ ఎడ్జి, కింగ్స్‌కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు శాస్త్రీపురం, రిజ్వాన్‌కాలనీ, ఒవైసీహిల్స్, డైమండ్‌హిల్స్, మామూ కి హోటల్, నసర్ కన్‌స్ట్రక్షన్స్, ఏహెచ్ కన్వెన్షన్, బీకే పురా, క్లాసి గార్డెన్‌లలో మరమ్మతుల వల్ల అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

గగన్‌పహాడ్ సబ్ స్టేషన్ పరిధిలో..

గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సాతంరాయి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు పాశంబండ, ఆర్‌జీకే, సుచిత్ర ఇందిరా, పాశంబండ ఏజీఎల్, మంజీరా కండెక్టర్, వీఎస్‌ఆర్ ఎవేన్యూ, త్రిషూల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు త్రిషూల్ ప్రాంతాల్లో, ఆర్‌ఈసీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమిళ్‌నాడు హోటల్, డైమండ్ వెయిట్ బ్రిడ్జి, బుద్వేల్ రైల్వే స్టేషన్, పరివార్ దాబా, ఆర్‌ఈసీ, ఆరాంఘర్ ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు లక్ష్మి నర్సింహుడి కల్యాణం

అత్తాపూర్, మే 21: నృసింహ జయంతి సందర్భంగా బుధవారం అత్తాపూర్‌లోని లక్ష్మినర్సింహ స్వామి ఆలయంలో స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం పూజల అనంతరం స్వామి కల్యాణం ఉంటుదని తెలిపారు. మధ్యాహ్నం దేవాలయ ప్రాగణంలో అన్నప్రసాద వితరణ ఉంటుందని కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని కమిటీ సభ్యులు కోరారు. సాయంత్రం స్వామి పల్లకీ సేవా ఉంటుందని తెలిపారు.

ముందుకు సాగని అభివృద్ధి

- పాతవి రద్దు.. కొత్త టెండర్లకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- యూసుఫ్‌గూడలో గతేడాది రూ.2.5 కోట్ల పెండింగ్ పనులు
- నూతన ఆర్థిక సంవత్సరంలో పనుల ఊసేలేదు

యూసుఫ్‌గూడలో జీహెచ్‌ఎంసీ-19వ సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణం పునాదుల వద్ద నిలిచిపోయిన పనులు (ఫైల్)

జూబ్లీహిల్స్, మే 21: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అభివృద్ధి పనులు అడుగు ముందుకుపడేలా కనబడడంలేదు. గతంలో చేసిన పనులకు బల్దియా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టేందుకు ససేమిరా అంటున్నారు. దీంతో ఆర్థిక సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా అభివృద్ధి పనుల ఊసేలేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గతేడాది జీహెచ్‌ఎంసీ-19వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. గతంలో వర్షాలకు గుంతలు పడ్డ రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వాలు మారడంతో పనులు ఆగిపోయాయి. పాత బిల్లులు రాలేదని కొత్త పనులు చేపట్టకపోవడంతో పాటు అప్పటికే ఆర్థిక సంవత్సరం ఆఖర్లో ఉండడంతో మళ్లీ అభివృద్ధి పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఇంతలో లోక్‌సభ ఎన్నికలు రావడంతో పాతకథే పునరావృతం అయింది. అయితే ఈసారి కాంట్రాక్టర్లు వేసిన టెండర్లను రద్దు చేసుకుంటున్నామని, గతంలో చేసిన పనులకు బిల్లులు వస్తేనే కొత్త పనులు చేపడతామని భీష్మించుక్కూర్చున్నారు. దీంతో గత ఆర్థిక సంవత్సరం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రూ.2.5 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన సుమారు 10 అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఫలితంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతో పాటు జీహెచ్‌ఎంసీ కార్యాలయ సొంత భవన నిర్మాణం వంటి మరికొన్ని పెద్ద ప్రాజెక్ట్‌లు అసంపూర్తిగా మిగిలిపోయాయి. పాత బిల్లులు మంజూరు కాకపోవడంతో కొత్త పనులకు వేసిన టెండర్లను పూర్తిగా రద్దు చేసుకున్నామని కాంట్రాక్టర్లు తెలిపారు. గతేడాది బిల్లులు రాలేదన్న నెపంతో ఈ ఏడాది కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా బిల్లులు రావడంలేదన్న మనోవేదనతో ఇటీవల ఒక కాంట్రాక్టర్ జీహెచ్‌ఎంసీ-14వ సర్కిల్ కార్యాలయంలో గుండెపోటుతో మృతి చెందడంతో నగరంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లులపై తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయాయి.

సాగును లాభాల బాటలోకి తేవాలి

- రైతుకు అండగా ఉంటూ, చైతన్యం చేయాలి
- వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మే 21: వ్యవసాయ ఉత్పత్తుల్ని సకాలంలో మార్కెట్‌లో అమ్ముకోవడంలో రైతులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ పి.రఘురామిరెడ్డి అన్నారు. విస్తరణ విద్యా సంస్థలో రెండురోజుల పాటు జరుగనున్న అమ్మకందారులు, కొనుగోలుదారుల సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇతర పరిశ్రమలు అధిక ఉత్పత్తి చేసినప్పుడు బోనస్ లభిస్తోందని, వ్యవసాయ రంగంలో మాత్రం అధిక ఉత్పత్తి కారణంగా నష్టాలు భరించాల్సి రావడం దురదృష్టకరమని చెప్పారు. త్వరగా వాడిపోయే పూలు, కూరగాయలు, ఆకుకూర వంటి ఉత్పత్తులకు మార్కెట్ జటిలమైన సమస్యగా మారిందని అన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధునాతన టెక్నాలజీని వినియోగించి ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి వ్యవసాయంలో ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. భవిషత్‌లో ఎఫ్‌పిఓలు చాలా కీలకపాత్ర పోషించనున్నారన్నారు. వ్యసాయ ఉత్పత్తుల్లో నాణ్యత, వైవిధ్యం స్వచ్ఛతలకు ప్రాధాన్యమిస్తే మార్కెటింగ్ సులువవుతుందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు జి.లక్ష్మీబాయి అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులన్నీ ఆరు నెలల పాటు గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవ డానికి కూడా ఒక పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీజేటీఎస్‌ఎయూ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ, విస్తరణ సంచాలకులు వి.సుధారాణి, ఐసీఏఆర్, ఐఐఆర్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామణ్ మీనాక్షి, విస్తరణ విద్యా సంస్థ సంచాలకుడు డాక్టర్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, నాబార్డ్ ప్రతినిధి ఎం.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ఆక్రమణల తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న ఏసీపీ రాణి

జూబ్లీహిల్స్, మే 21: రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమణలు చేస్తే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి హెచ్చరించారు. మంగళవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రోడ్లపై ఆక్రమణల తొలగింపుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ పార్కు రోడ్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణాలను తొలగించారు. పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వీధి వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

మార్షల్ ఆర్ట్స్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, మే 21: మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణతో పాటు శరీర దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రెండో జూనియర్ ఇంటర్ డ్రిస్టిక్ విష్యూ చాంపియన్‌షిప్ 2024లో మైలార్‌దేవ్‌పల్లిలోని మహవీర్ మార్షల్ ఆర్ట్స్ అకాడామీ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబరిచారు. ఇటీవల నిజామాబాద్‌లో అమెచ్యూర్ విష్యూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. అకాడమీకి చెందిన ఎ.జయవర్ధన్ ఉత్తమ ప్రతిభకనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. మంగళవారం విజేతతోపాటు పాటు కోచ్ సంతోష్‌యాదవ్‌లను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బండ రాజేశ్‌యాదవ్ తదితరులున్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

ఎర్రగడ్డ, మే 21: బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్ హరిహర క్షేత్ర దేవస్థానంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు పూజలు, యాగశాల ప్రవేశం, యాగమంటపారాధన నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో స్వామివారి ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కల్వల సత్యనారాయణరావుతో పాటు ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, మే 21: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ కోరారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ రంగాలను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాయని అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనాలు కార్మికులకు అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మొబైల్స్ చోరీకి యత్నించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, మే 21: గదిలోకి ప్రవేశించి మొబైల్ ఫోన్స్ చోరీ చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్‌పేటలో ఉంటున్న మోనుకుమార్ అనే యువకుడు పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తుంటాడు. గదిలో తన స్నేహితుడు కన్హయ్యకుమార్‌తో కలిసి నిద్రపోతున్న సమయంలో అలికిడి వినిపించింది. గుర్తుతెలియని వ్యక్తి గదిలోకి వచ్చి రెండు సెల్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు చోరీ చేసి బయటకు వెళ్తున్నట్లు గుర్తించిన మోనుకుమార్ అతడిని పట్టుకున్నాడు. ఫిలింనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదుతో ఐపీసీ 379 రెడ్‌విత్ 511 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమయపాలన పాటించాలి

ముషీరాబాద్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటి

ముషీరాబాద్, మే 21: ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె. వెంకటి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు అందిస్తున్న తీరును పరిశీలించిన ఆయన వసతులు, రికార్డుల నమోదు తీరును తనిఖీ చేశారు. చిన్నారులకు టీకాలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యంవహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో వైద్య సేవల విస్తరణ, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఇప్పటి నుంచే అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశ్రిత, ముషీరాబాద్ పీహెచ్‌సీ డాక్టర్ దీప్తిప్రియాంక, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కట్నం తీసుకోకుండా వివాహం చేసుకోవాలి

కాచిగూడ, మే 21: యువకులు వరకట్నం తీసుకోకుండా వివాహం చేసుకోవాలని విశ్వకర్మ మ్యాట్రిమోని వ్యవస్థాపకుడు యర్రోజు రాజరాజేశ్వరి నరసింహచారి పిలుపునిచ్చారు. మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ మ్యాట్రిమోని ఆధ్వర్యంలో జూన్ 9న ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుల్లేటికుర్తి కల్యాణ మండపం, చిట్టినగర్, విజయవాడలో ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేదికలో యువతీయువకులు పాల్గొని వివాహ సంబంధాలు కుదుర్చుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 7382252782, 9110766408లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మగ్గం వర్కుపై ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్, మే 21: స్వర్ణభారత్ ట్రస్టులో మహిళలకు ఉచితంగా మగ్గం వర్కుపై శిక్షణ ఇస్తున్నట్లు స్వర్ణభారత్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వర్ణభారత్ ట్రస్టు-యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా మగ్గం వర్కులో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు వారికి మాత్రమే అవకాశం ఉందన్నారు. రేషన్, ఆధార్‌కార్డులతోపాటు ఈనెల 24న ఉదయం 9.30 గంటలకు శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 19 నుంచి 45ఏండ్ల వరకు అవకాశం ఉందన్నారు. 30 రోజుల పాటు ఉచితంగా భోజనంతో పాటు వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు.

25న సైకాలజిస్టుల శిక్షణ శిబిరం

వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

చిక్కడపల్లి, మే 21: సైకాలజిస్టుల నైపుణ్యం పెంపొందించేందుకు సైకియాట్రిస్ట్ డాక్టర్ రవ్వ హరికుమార్‌తో ఆందోళన నిర్మూలన మార్గాలపై జాతీయస్థాయి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మ, డాక్టర్ క్వార్లిన్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ ప ర్సనాలిటీ కేర్‌లో వారు మాట్లాడుతూ.. శనివారం ఉదయం 9 నుంచి సాయం త్రం 5 గంటల వరకు అశోక్‌నగర్‌లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సైకాలజిస్టులు, సైకాలజీ విద్యార్థులు పాల్గొనవచ్చని, 93900 44031లో సంప్రదించాలని సూచించారు.

పాన్‌షాపు నిర్వాహకుడికి జైలుశిక్ష

మెహిదీపట్నం: రాత్రి వేళలో పాన్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వివరాల ప్రకారం.. పాన్ అడ్డా పేరుతో మజహర్‌పాషా పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. నిబంధలను అతిక్రమించి రాత్రిళ్లు షాపు తెరుస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి అతడికి 5 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

మాటువేసి.. పట్టేశారు..

- మొబైల్ స్నాచింగ్‌తో చేజింగ్ • పట్టుబడిన వారిపై అనేక కేసులు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న యాంటీ స్నాచింగ్ బృందం • పోలీసులకు అభినందనలు

బంజారాహిల్స్, మే 21: స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠాలను పట్టుకునేందుకు నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలతో ప్రత్యేకంగా నియమించిన బృందం అత్యంత చాకచక్యంగా ఇద్దరు కరడు గట్టిన నేరస్థులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల నగర వ్యాప్తంగా స్నాచింగ్ ఘటనలు ఎక్కువ కావడంతో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో ఒక్కో డివిజన్‌లో నలుగురు సభ్యులతో యాంటీ స్నాచింగ్ టీమ్స్ ఏర్పాటు చేశారు. ఇద్దరు ఏఆర్ కానిస్టేబుల్స్‌తో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇద్దరు క్రైం సిబ్బందితో ఏర్పాటు చేసిన ఈ బృందాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఇటీవల రంగంలోకి దించారు. ఎక్కువగా స్నాచింగ్స్ జరుగుతున్న ప్రాంతాల్లో సాధారణ వ్యక్తుల్లో కలిసిపోయి నిఘా పెట్టాలని, స్నాచర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలని టాస్క్ విధించారు. కాగా ఈనెల 20న తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్ నం-1లోని హయత్ ప్లేస్ జంక్షన్ వద్ద రోడ్డు పక్కన కారు ఆపి నిద్రపోతున్న క్యాబ్ వద్దకు బైక్‌పై వచ్చి ఆగిన ఇద్దరు ఆగంతకులు క్యాబ్ డ్రైవర్‌కు చెందిన మొబైల్ ఫోన్‌ను తస్కరించారు. నిందితులు వెళ్తున్న దృశ్యాన్ని అదే ప్రాంతంలో నిఘా పెట్టిన ప్రత్యేక యాంటీ స్నాచింగ్ బృందం సభ్యులు వారిని సినీ ఫక్కీలో చేజ్ చేశారు. కిలోమీటర్ దూరంలోనే వారిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇద్దరూ రౌడీషీటర్లే..

మొబైల్ ఫోన్ చోరీకి పాల్పడుతూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను విచారించగా వారిద్దరూ కరడుగట్టిన నేరస్థులైన రౌడీషీటర్లని తేలింది. వీరిలో ఫస్ట్‌లాన్సర్‌కు చెందిన సయ్యద్ మాజీద్ అలియాస్ బెంగాలీ, అలియాస్ డాక్టర్(31)పై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో 9 కేసులు ఉన్నాయని తేలింది. మరో నిందితుడు సయ్యద్‌నగర్‌కు చెందిన ఫయ్యాజ్ ఖాన్(47)పై నగర వ్యాప్తంగా 14కేసులు నమోదయినట్లు

సయ్యద్ మాజీద్

ఫయాజ్ ఖాన్

తేలింది. హత్యకేసుతో పాటు స్నాచింగ్‌లు, బ్లాక్‌మెయిల్స్, ఆర్మ్స్ యాక్ట్ తదితర కేసుల్లో వీరిద్దరు నిందితులుగా ఉండడంతో పాటు పీడీ యాక్ట్ కింద రెండుసార్లు జైలుకు వెళ్లివచ్చారని తేలింది. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. కరడుగట్టిన నేరస్థులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న యాంటీ స్నాచింగ్ టీమ్ సభ్యులు సురేశ్, రమేశ్, అరవింద్, విష్ణువర్ధన్‌లను నగర పోలీస్ కమిషనర్‌తోపాటు బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

వృద్ధుడు అదృశ్యం

పుల్లరి రాయులు

ఖైరతాబాద్, మే 21: బీడీ కొనుక్కుంటానని బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం... మహబూబ్‌నగర్ జిల్లా నార్వ మండలానికి చెందిన పుల్లరి రాయులు (62) రైతు. ఈనెల 14న ఖైరతాబాద్ తుమ్మబస్తీలో నివాసం ఉండే ఆయన సోదరి ఇంటికి వచ్చా డు. 19న బీడీ కొనుక్కొని వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు కూడా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యు లు, స్వగ్రామంలో ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో ఆయన కొడుకు పుల్లరి భీమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సిం గ్ కేసు నమోదు చేశారు.

బర్త్‌డే కోసం బయటకు వద్దన్నందుకు బాలిక..

బంజారాహిల్స్, మే 21: బర్త్‌డే కోసం స్నేహితులతో బయటకు వెళ్లేందుకు తల్లి అంగీకరించకపోవడంతో ఆధార్ కార్డుతో పాటు నగదుతో ఇంట్లోంచి బాలిక వెళ్లిపోయింది. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు.. యూసుఫ్‌గూడ ఎల్‌ఎన్‌నగర్‌కు చెందిన ప్రవలిక(17) ఈనెల 19న తన జన్మదినం సందర్భంగా ఫ్రెండ్స్‌తో కలిసి బయటకు వెళ్తానంటూ ముందు రోజు తల్లికి చెప్పగా ఆమె అంగీకరించలేదు. తల్లి డ్యూటీకి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో కూతురు కనిపించలేదు. రాత్రయినా కుమార్తె ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి గదిలో పరిశీలించగా.. ప్రవల్లిక బంగారు రింగులు, రూ.7వేల నగదుతో పాటు ఆధార్ కార్డు కనిపించలేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి రాణి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అలరించిన సంగీత విభావరి

ముషీరాబాద్: శౌర్య మ్యూజిక్ అండ్ ఎంటర్టైన్మెంట్ సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురినీ అలరించింది. గాయకులు ఇందు, దివ్య, ప్రతిభ, వినయ్, హరి, శోభన్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, శరత్ ఆలపించిన మధుర గీతాలు రంజింపజేయి. సంస్థ నిర్వాహకులు స్నేహ హసంతి, గాయకులు రమ్య, యోగిత, గోవార్ధన్ నాగేందర్‌రావును సత్కరించారు.

అడుగడుగునా నిర్లక్ష్యపు గండం

- కరెంట్ షాక్‌తో ప్రాణాలు పోతున్నా స్పందించరా?
- వీధిదీపాల విభాగం తీరుపై స్థానికుల ఆగ్రహం
- ఎటుచూసినా స్ట్రీట్‌లైట్స్ పోల్స్ వద్ద తేలిన వైర్లు

డీఏవీ స్కూల్ ఎదురుగా విద్యుత్ స్తంభం వద్ద ప్రమాదకరంగా వైర్లు

రోడ్ నం 14లో స్ట్రీట్‌లైట్ పోల్‌వద్ద తేలిన వైర్లు

బంజారాహిల్స్, మే 21: వరుస ప్రమాదాల్లో కరెంట్ షాక్‌తో జనం ప్రాణాలు పోతున్నా జీహెచ్‌ఎంసీ వీధిదీపాల విభాగం అధికారులు నిర్లక్ష్యం మత్తును వీడడం లేదు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 పరిధిలోని పలు రహదారులపై వీధి దీపాలకు సంబంధించిన స్తంభాలు ప్రమాదకరంగా మారినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నెలరోజుల క్రితం శ్రీకృష్ణానగర్ ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడు స్ట్రీట్‌లైట్‌కు తగిలి కరెంట్‌షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో వీధి దీపాల విభాగం అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. అయినా ఈ విభాగం అధికారుల్లో ఏమాత్రం చలనం కనిపించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్స్ వద్ద ప్రమాదకరమైన పరిస్థితులు ఉన్నాయి. కొన్నిచోట్ల వైర్లు బయటకు తేలడం, మరికొన్ని చోట్ల ఫ్యూజ్‌బాక్స్ మూతలు లేకపోవడం, ఇంకొన్ని చోట్ల స్ట్రీట్‌లైట్స్ చుట్టూ వివిధ రకాలైన వైర్లు, వేలాడుతూ కనిపిస్తున్నాయి. రోడ్డుపై నడుచుకుంటూ పొరపాటున చేయి తాకితే ప్రాణాలు పోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తోడు, స్ట్రీట్‌లైట్స్ కరెంట్ షాక్ కొట్టే ప్రమాదం ఉండడంతో జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. వెంటనే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 పరిధిలోని వీధి దీపాలను మొత్తం పరిశీలించి ప్రమాదాన్ని తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.